# కమలం గూటికి బిఆర్ఎస్ ఎంపి బిబి పాటిల్

## పార్లమెంట్ ఎన్నికల ముందు బిఆర్ఎస్‌కు షాక్



**జహీరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అధికారం కోల్పోయి తీవ్ర నిరాశలోకి పోయిన బిఆర్ఎస్ పార్టీకి సిట్టింగ్ ఎంపిలు ఒకరు ఒకరు పార్టీ మారుతూ బిఆర్ఎస్‌కు షాక్ ఇస్తుండగా తాను సైతం అంటూ జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్ కారుదిగి కమలం గూటికి చేరుకోనున్నారు. రెండు మూడు రోజుల్లో సంగారెడ్డిలో జరిగే బిజెపి సమావేశంలో ఎంపి బిబి పాటిల్ కారు దిగనున్నట్లు విశ్వసనీయ సమచారం. బిజెపి పార్టీ పెద్దలతో ఎంపి బిబి పాటిల్ ఈ పాటికే సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. జహీరాబాద్ స్థానం నుంచే బిజెపి నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించేందు పార్టీ అధిష్టానం సై అన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గంలోని కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన బిబి పాటిల్ 2014, 2019లో ఎంపిగా పోటీ చేసి పార్లమెంట్ తలుపులు తట్టారు. గత కొంత కాలంగా ఎంపి బిబి పాటిల్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవల ముగిసిన శాసన సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు తరఫున ప్రచారం సైతం చేయలేదని కార్యకర్తలు పేర్కొంటున్నారు. జహీరాబాద్‌లో జరిగిన కేసిఆర్, హరీష్‌రావుల సభలకు మాత్రమే బిబి పాటిల్ హాజరై ప్రచరానికి మమ అనిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 5న సంగారెడ్డి జరిగే సమావేశంలో ఢిల్లీ పెద్దల సమక్షంలో బిజెపి తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి : మంత్రి తుమ్మల

**హైదరబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** నాయకులు మధ్య విభేదాలను పక్కనపెట్టి అందరిని కలుపుకుని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మల్కాజగిరి పార్లమెంట్ ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెపిహెచ్‌బి కాలనీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద నిర్వహించిన కూకట్‌పల్లి నియోజకవర్గం మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పార్లమెంట్ ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతుందని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లోపించిందని అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకుని కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి తమవంతు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బండి రమేష్, గొట్టిముక్కల వెంకటశ్వేరరావు, శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గాలి బాలాజీ, లక్ష్మయ్య, సునీల్‌యాదవ్, కు క్కల రాజు ముది రాజ్, మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి త దితరులు పాల్గొన్నారు.

# సబ్‌రిజిస్ట్రార్‌ఆఫీస్ రికార్డురూమ్ తాళాలు పగలగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

**హైదరాబాద్ (మూసాపేట), ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** ప్రశాంత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు ఎప్పటిలాగానే బుధవారం రోజు విధులు ముగించుకుని ఆఫీస్‌కి తాళంవేసి వెళ్లిన ఉద్యో గులు, ఉదయం ఆఫీస్‌కి వచ్చిన సమయంలో రికార్డ్ రూం తాళాలు పగులగొట్ట బడి ఉన్నదని గుర్తించారు. అయితే అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆఫీస్‌లోకి చొరబడి రికార్డు రూం తాళాలు పగులగొట్టి ఉండవచ్చునని ఆర్.సతీష్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీంతో కూకట్‌పల్లి పోలీసులు కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటి వరకు అయితే ఎటువంటి రికార్డు పోయినట్టుగా గుర్తించబడలేదు.

# డిఎస్‌సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలి

## బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాత వార్త:** తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్‌సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలని బీఎస్‌పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మెగా డీఎస్‌సీ నోటిఫికేషన్ చాలా మంది బీఎడ్ అభ్యర్థులకు నిరాశ కలిగించిందని సీఎం రేవంత్‌రెడ్డిని ట్యాగ్ చేస్తూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం ట్వీట్ చేశారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నందుకు ముఖ్యమంత్రికి ధన్యవా దాలు తెలిపారు. అయితే 4 లక్షల మంది బీఎడ్ అభ్యర్థులకు కేవలం 2629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులనే ప్రకటించడం అన్యాయ మన్నారు. ఈ పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కేవలం మూడుసార్లే టెట్ నిర్వహించిందని.. కానీ మీరు అలా కాకుండా ఏటా రెండుసార్లు టెట్ పరీక్షను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నేత సూరంపల్లిపై కత్తులతో దాడి

## ఖమ్మం కిమ్స్ హాస్పిటల్‌కు తరలింపు

## నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి పోలీసులు

**కొణిజర్ల, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుపై గురువారం అర్ధరాత్రి కత్తులతో దాడి చేసిన ఘటనతో ఒక్కసారిగా వైరా నియోజకవర్గం ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే కొణిజర్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు బుధవారం ఖమ్మంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వచ్చి పడుకొని గురువారం తెల్లవారుజామున అర్ధరాత్రి సమయంలో మూత్రవిసర్జన కోసం బయటికి రాగానే గుర్తుతెలియని వ్యక్తి మాటు వేసి పొడిచాడు. దీంతో ఒక్కసారిగా తేరుకొని కేకలు వేయడంతో అప్పటికే నిందితుడు విచక్షణారహితంగా పొడిచి పారిపోయాడు. వెంటనే చుట్టుపక్కల వారు నిద్రలోంచి లేచి చూడగా కత్తిపోటులతో గాయాలై రక్తం కారుతున్న సూరంపల్లిని చూసి ఒక్కసారిగా భయాందోళనకు గురై సంబంధిత పోలీస్ వారికి సమాచారం అందించగా స్థానిక ఎస్సై శంకర్‌రావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన సూరంపల్లి రామారావును వెంటనే వైద్య సహాయం నిమిత్తం ఆంబులెన్స్‌లో కిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామ, మండల, నియోజకవర్గ ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# శ్రీశైలం, ఎన్ఎస్‌పి ఆనకట్టలకు పొంచి ఉన్న ప్రమాదం

## అనుమతులున్న ప్రాజెక్టులకే నీటిని కేటాయించనున్న కెఆర్ఎంబి

## ఎపి, తెలంగాణ రాష్ట్రాల సమన్వయం కోసమే కెఆర్ఎంబి

## అపోహాలు సృష్టించే ప్రయత్నాలు చేయొద్దు

## కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు, నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ శ్రీరాం వెదిర



**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణను రెండు ప్రభుత్వాలు విస్మరించడంతో గత పదేళ్ళుగా వాటి భద్ర తకు ప్రమాదం ఏర్పడిందని 2009 తరహా వరదలు కృష్ణానదికి సంభవిస్తే అది తట్టుకొని నిలబడటం అనుమానస్పదమే అని కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ సలహాదారు నదుల అనుసంధాన కమిటి టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిర శ్రీరాం ఆందోళనను వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్ ఇన్ఫర్‌మేషన్ బ్యూరో కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లంజ్‌పూల్ దిగువస్థాయిలో ఆనకట్టకు సంబంధించిన పునాది నిర్థారిత ప్రమాణాల కంటే తక్కువగా బలహీనంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం భద్రత తనిఖీ కోసం జాతీయ ఆనకట్టల భద్రత ప్రాధికార సంస్థ, కేంద్ర జలసంఘం,సిఎస్ఎంఆర్ఎస్, కృష్ణానది యాజమాన్యబోర్డు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో జనవరి 9న కమిటీని వేశారని ఆయన తెలిపారు. శ్రీశైలం పునాది వద్ద అనేక రంధ్రాలు ఏర్పడి నీటి వూట కూడా ఉబికి వస్తుందని వెదిర శ్రీరాం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టును 13 ఫిబ్రవరిన ఎన్‌డిఎస్‌ఏ అధికారులు సందర్శించగా అక్కడ కుడివైపు మరమ్మతులునిర్వహణపనులు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆటంక పరుస్తుండటంతో దాని పరిస్థితి కూడా ప్రమాదం అంచులో ఉందిన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 8న రాసిన లేఖతో ఇటీవలే నిర్వహణ పనులు చేయడానికి సిఆర్‌పిఎఫ్ తెలంగాణ ప్రభుత్వంకు సహకరించాలని సూచించారు. స్పిల్‌వేగేట్ల భద్రత వర్షాకాలం ముందే చేయాలి లేదంటే డ్యామ్ భద్రతకు ముప్పుకలిగిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా రూపొందించలేదని కేంద్ర జలశక్తి సలహాదారు వెదిర శ్రీరాం ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల సమస్య పరిష్కారం కోసమే గత అక్టోబర్‌లో ట్రిబ్యునల్ వేశామని తెలిపారు. ఆరు ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలని విభజనచట్టంలోనే తెలంగాణకు వెసులుబాటు ఇచ్చారని తెలిపారు. విభజన చట్టం రూపొందించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో దానిని తప్పు అంటున్నది. కెఆర్ఎంబి రెండు రాష్ట్రాలు గొడవపడుతుంటే వారి మధ్య కెఆర్ఎంబి లేకపోతే సమన్వం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. గత పదేళ్ళుగా కెఆర్ఎంబి ఆరు అంశాలను పర్యవేక్షిస్తున్నదని ప్రజలలోకొత్తగా అపోహాలు సృష్టించడం తగదని ఆయన అన్నారు. కెఆర్ఎంబి అనుమతి ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే నీటి కేటాయింపులు చేస్తుందని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అనుమతి లేకుండా నిర్మించిన ప్రాజెక్టులకు110 టిఎంసిలు యథేచ్ఛగా తరలించుకుపోతుందని అన్నారు. కెఆర్ఎంబిని విలన్‌గా చూపి కాంగ్రెస్ బిఆర్ఎస్ పరస్పరం నిందించుకుంటూ కాలం గడుపుతున్నాయి.

### మేడిగడ్డ విచారణకు చంద్రశేఖర్ అయ్యర్‌తో విచారణ కమిటీ

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ బ్యారేజి కుంగిపోవడంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటి చంద్రశేఖర్ అయ్యార్‌తో విచారణ కమిటని ఏర్పాటు చేసిందిని వెదిర శ్రీరాం తెలిపారు. నాలుగునెలలో చంద్రశేఖర్ అయ్యార్ రిపోర్టు ఇవ్వాలని విధివిధానాలలో పేర్కొన్నా నెల రోజుల్లోనే నివేదిక వస్తుందని దానిని బట్టి మేడిగడ్డ మరమ్మతులు చేయాలో వద్దో నిపుణులు నిర్ణయిస్తారని తెలిపారు. వారం రోజుల్లో ఎన్‌డిఎస్‌ఏ మేడిగడ్డ బ్యారేజి పరిశీలనకు రానున్నది. మేడిగడ్డ ఘటన తరువాత కేంద్ర ప్రభుత్వం అడిగిన వివరాలు రాష్ట్ర అధికారులు ఇవ్వలేదని ఇప్పటికి కాంగ్రెస్ పాలకులు ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు. జాతీయ ఆనకట్టల భద్రత ప్రాధికారసంస్థ చంద్రశేఖర్ నేతృత్వంతో ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల బృందానికి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సర్వే చేయకుండానే ప్రాజెక్టు కట్టడం పెద్ద తప్పు . థర్డ్ పార్టీ నాణ్యత తనిఖీ చేయడం చాలా అవసరం అయినా అది కూడా చేయలేదు. ప్రాజెక్టు నిర్మాణం వివిధ స్థాయిలో తనిఖీ చేసి ఎంబి బుక్కు రికార్డులు చేయాల్సి ఉండాల్సింది.

### తుమ్మడివాట్టి వద్ద నీళ్లు లేవని బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం

ప్రాణహిత నదిలో తుమ్మడిహట్టి వద్ద నీళ్ళు లేవని కేంద్రజలసంఘం చెప్పిందని తప్పుడు ప్రచారం బిఆర్ఎస్ చేస్తున్నదని వెదిర శ్రీరాం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిర్మాణ విషయంలో కేంద్రం అడ్డుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కల్పిండమే అని అభ్యంతర చెప్పలేదని ఆయన అన్నారు. కాళేశ్వరం నుంచి థర్ టిఎంసి ఎత్తి పోసే విషయంలోనే ఏలాంటి అనుమతులు లేవని కేంద్రం అభ్యంతరం తెలిపిందని అందువల్ల ఆర్ఇసి, పిఎఫ్‌సి నుంచి 2800వ కోట్ల నిధులు రాకుండా ఆపగలిగామని ఆయన వివరించారు. కేంద్ర జలసంఘం ఏలాంటి అనుమతులు కాళేశ్వరం డిజైన్‌కు ఇవ్వలేదని అది రాష్ట్రప్రభుత్వం సొంతంగా డిజైన్ చేసుకున్నదే అని అన్నారు. కాళేశ్వరం వద్ద120రోజులు 165 టిఎంసిల నీటి లభ్యత ఉందని సిడబ్యుసి చెప్పిందని కానీ సిడబ్లుసి నీళ్ళులేవని అన్నదని బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం పదేపదే చేసిందని ఆయన విమర్శించారు.

### మాజీ మంత్రి కెటిఆర్‌కు కౌంటర్

నేను ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతున్నాను. నేను పొలిటికల్ కామెంట్ చేస్తే బిజెపి ఆఫీసులో మాట్లాడేవాడిని వాస్తవాలు మాట్లా డుతున్నాను భువనగిరి సీటు అడిగింది వాస్తవమే పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో తప్పులు ఉంటే దేనికైనా రడీగా ఉంటాను కేఆర్ఎంబి ఏ ప్రాజెక్టును టేక్ఓవర్‌చేయలేదు నీటి వాటాల కోసం కొత్త యాక్ట్ వస్తుందని మూడేళ్ళలో అది రాబోతుంది.

# డ్రగ్స్ కేసులో వివేకానంద డ్రైవర్, మరో డ్రగ్ సరఫరాదారు అరెస్టు

సంవత్సర కాలంగా డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వివేకానంద

పోలీసు విచారణకు హాజరైన రఘుచరణ్, విదేశాలకు చెక్కేసిన నీల్

జాడలేని మిగిలిన నిందితులు – 160 సిఆర్‌పిసి నోటీసులు జారీ

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** గచ్చిబౌలి రాడిసన్ బ్లూ డ్రగ్స్ పార్టీ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులకు డ్రగ్స్ సప్లయ్ చేసిన నగరానికి చెందిన మీర్జా వహీద్ భేగ్‌తో పాటు డ్రగ్స్‌ను వివేకానందకు చేరవేసిన అతని డ్రైవర్ గద్దల ప్రవీణ్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరి అరెస్టులో ఈకేసులో ఇప్పటి వరకు మొత్తం 6గురిని పోలీసులు అరెస్టు చేయగా, రఘుచరణ్ అనే వ్యక్తి గురువారం పోలీసు విచారణకు హాజరయ్యాడు. డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న మరో 5గురి ఆచూకీ ఇప్పటి వరకు లేకుండా పోయింది. పోలీసులు మిగిలిన 5గురు నిందితులకు 160 సిఆర్‌పిసి నోటీసులు జారీ చేయగా, నీల్ అనే నిందితుడు విదేశాలకు పారిపోయినట్లు సమాచారం అందుతుంది.

గచ్చిబౌలి రాడిసన్ బ్లూ హోటల్ డ్రగ్స్ పార్టీ కేసులో ప్రధాన నిందితుడు, పార్టీ నిర్వహించిన మంజీరా గ్రూప్ డైరెక్టర్ గజ్జెల వివేకానందను ఫిబ్రవరి 26వ తేదీన అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వివేకానంద ఇచ్చిన సమాచారంతో టాలివుడ్ నిర్మాత కేధారినాథ్, వ్యాపారవేత్త నిర్భయ్‌లను పోలీసులు అదేరోజు అరెస్టు చేసి ముగ్గురికి పరీక్షలు నిర్వహించగా, కొకైన్ తీసుకున్నట్లు తేలింది. దీంతో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కాగా డ్రగ్స్ పార్టీ కోసం కొకైన్‌ను సరఫరా చేసిన హోటల్ మాజీ ఉద్యోగి సయ్యద్ అబ్బాస్ ఆలీ జాఫ్రీని మంగళవారం అరెస్టు చేశారు. సయ్యద్ అబ్బాస్ అలీ జాఫ్రీ విచారణలో వెల్లడించిన సమాచారంతో అబ్బాస్‌కు డ్రగ్స్ సరఫరా చేసిన పాతబస్తీకి చెందిన మీర్జా వహీద్ భేగ్‌ను, వివేకానందకు డ్రగ్స్ చేరవేసిన అతని డ్రైవర్ గద్దల ప్రవీణ్‌లను సైతం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం రఘుచరణ్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పోలీసు విచారణకు హాజరయ్యాడు. తాజాగా వీరి మీద 160 సిఆర్‌పిసి నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఈకేసులో నిందితుడిగా ఉన్న నీల్ విదేశాలకు పారిపోయినట్లుగా సమాచారం అందుతుంది.

### ఆచూకీలేని ఐదుగురు నిందితులు

రాడిసన్ డ్రగ్స్ పార్టీలో మొత్తం 10మంది పాల్గొనగా, వీరిలో 4గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి డ్రగ్స్ సరఫరా చేసిన వహీద్ భేగ్‌ను, వివేకానంద డ్రైవర్ ప్రవీణ్‌లను సైతం పోలీసులు అరెస్టు చేశారు. రఘుచరణ్ గురువారం విచారణకు హాజరుకాగా, 5గురు నిందితులు పత్తా లేకుండా పోయారు. ఇందులో టాలివుడ్ దర్శకుడు క్రిష్ ఉండగా, మొదట క్రిష్ పోలీసు విచారణకు వచ్చి సహకరిస్తానని చెప్పగా, ప్రస్తుతం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. పోలీసులకు వాట్సాప్ మెసేజ్ ద్వారా అందుబాటులోకి వచ్చిన క్రిష్ తాను విచారణకు సోమవారం వస్తానని చెప్పి నట్లు సమాచారం అందుతుంది. నటి లిషీ గణేషా సైతం సంఘటన జరిగిన రోజు నుంచి పరారీలో ఉన్నారు. లిషీ గణేషాకు 160సిఆర్‌పిసి నోటీసు జారీ చేయగా, ఆమె సోదరి కుషితా పోలీస్ స్టేషన్‌కు వచ్చింది.

### యేడాదికాలంగా డ్రగ్స్ కొనుగోలు

వివేకానంద గత సంవత్సర కాలంగా అబ్బాస్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అబ్బాస్ కొకైన్‌ను పాతబస్తీకి చెందిన మీర్జా వహీద్ భేగ్ వద్ద గ్రాముకు 14వేల రూపాయల చొప్పున కొనుగోలు చేసేవాడు. అబ్బాస్ కొకైన్‌ను మీర్జాబేగ్ వద్ద తీసుకొని వివేకానంద డ్రైవర్ ప్రవీణ్‌కు అందజేసేవాడు. ప్రవీణ్ తన యజమానికి సదరు డ్రగ్స్‌ను చేరవేస్తుండేవాడు. గత సంవత్సర కాలంగా డ్రగ్స్‌ను బానిసగా మారిన వివేకానంద ప్రవీణ్ సహాయంతో అబ్బాస్, వహీద్‌ల వద్ద కొకైన్ కొనుగోలు చేసి తన స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకున్నాడని విచారణలో తేలింది.

16th DEATH ANNIVERSARY

"He Whose Mind is Not Shaken By Adversity, Who Does Not Hanker After Pleasures, Who is free from Attachment, fear and Anger, He is The Saga of Steady Wisdom". Bhagvad Gita



D.O.B : 03 - 07 - 1921    D.O.D : 01 - 03 - 2008

SHRI RAM SHARANJI SANGHI

Founder Chairman

Sanghi Group of Industries

IN LOVING MEMORY

His Guiding Spirit has Been and will always be the Source of Inspiration for all of us.

ANJANA ANAND SANGHI
SUDHIR - USHA SANGHI
RAVI - ANITA SANGHI
GIREESH - ALKA SANGHI
SHOBHA - RAMESH JAIN
JAISHREE - SHASHI MITTAL
ALL GRAND CHILDREN & GREAT GRAND CHILDREN
AND ENTIRE FAMILY

# తల్లిని కడతేర్చిన తనయ!

**భూత్పూర్,ఫిబ్రవరి 29,ప్రభాతవార్త :** కన్నతల్లినే కడతేర్చిన ఓ కూతురు ఉదంతం భూత్పూర్ మండలం కరివెన గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. భూత్పూర్ పోలీస్ సీఐ రామకృష్ణ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కాకి వెంకటమ్మ(60)కు కాకి నారమ్మ అనే కూతురు ఉంది. కొన్నేళ్ల క్రితం నారమ్మ భర్త వదిలేయగా నారమ్మ తల్లి వద్దనే ఉండేది. అయితే నారమ్మ తాగుడుకు బానిసై అనునిత్యం డబ్బుల కోసం తల్లి కాకి వెంకటమ్మతో గొడవపడేది. గురువారం కూడా డబ్బుల విషయంలో గొడవ పడి వీరిరువురు చేను వద్దకు వెళ్తుండగా డబ్బులు ఇవ్వడంలేదనే అక్కసు తో తల్లి కాకి వెంకటమ్మను కూతురు కాకి నారమ్మ దొడ్డు కర్రతో తలపై గట్టిగా మోది బాధడంతో వెంకటమ్మకు తలకు బలమైన గాయాలు కాగా ఆమెను వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు కాకి నర్సింహా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసును పరిశీలిస్తున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

# బిఆర్ఎస్ మేడిగడ్డ పర్యటనకు కౌంటర్‌గా పాలమూరు పాలమూరు రంగారెడ్డి పర్యటన

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** కాళేశ్వరంపై వచ్చిన విమర్శలకు సమాధానంగా బిఆర్ఎస్ చేపట్టిన మేడిగడ్డ పర్యటనకు కౌంటర్‌గా కాంగ్రెస్ మరో పర్యటనకు సిద్దమైంది. శుక్రవారం పాలమూరు రంగారెడ్డి పర్యటనకు రావాలని ఉమ్మడి రంగారెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ నేతుల పిలుపునిచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును విస్మరించిందని ఆరోపిస్తుంది. ఈనేపథ్యంలో పాలమూరు రంగారెడ్డి పర్యటనకు హస్తం నేతలు పిలుపునిచ్చారు.

# భారీగా తగ్గిన గుడ్డు ధర

## డజను రూ.69 నుండి రూ.55కు దిగొచ్చిన రేటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** ఇటీవల తారాస్థాయికి చేరుకున్న కోడి గుడ్ల ధరలు ఇప్పుడు భారీగా పడిపోయాయి. సామాన్యులకు భారంగా పెరిగి కొండెక్కిన గుడ్డు రేటు దిగింది. తాజాగా గురువారం హైదరాబాద్ మార్కెట్‌లో డజను 55 రూపాయలకు చేరుకున్నాయి. ఈ లెక్క ఒక్క గుడ్డు ధర రూ.4.6 పైసలు పడుతోతంది. నిన్న మొన్నటి వరకూ ఒక్క గుడ్డు ధర 5.82 రూపాయల ఉండగా, డజను 69 రూపాయలకు విక్రయించారు. కాగా గత కొన్ని తెలంగాణలో కోడి గుడ్డు కొండెక్కింది. జనవరి నెలలో కేవలం వారం రోజుల వ్యవధిలోనే డజను గుడ్లు 70 రూపాయల నుండి 85 రూపాయలకు పెరిగింది.

# సాగర్‌నుంచి ఎపికి 3 టిఎంసిలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** నాగార్జునసాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మూడు టిఎంసిల నీటిని విడుదల చేసేందుకు కృష్ణానది యాజమాన్య బోర్డు అనుమతి ఇచ్చింది .కుడికాల్వ హెడ్ రెగ్యూలేటర్ ద్వారా శుక్రవారం నుంచి నీటిని ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు .కెఆర్ఎంబి అధికారులు ఇందుకు ఉత్తర్వులు జారీచేసింది,. తెలంగాణ ప్రభుత్వం ఏపి తాగునీటి అవసరాలపై నిఘా ఉంచాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మూడు టిఎంసిలు సాగునీటికి వాడుతున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

# మార్చి2న శంషాబాద్‌లో పంచాయతీరాజ్ సంఘటన్ సమావేశం

### పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ సిద్దేశ్వర్, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** పంచాయతీరాజ్ సంఘటన్ అభియాన్ సమావేశం శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నామని పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ సిద్దేశ్వర్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ 33 జిల్లాల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జాతీయ నాయకులు హాజరవుతారని అన్నారు. ఆత్మహత్యచేసుకున్న సర్పంచ్‌ల కుటుంబాలు కూడా వస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత గ్రామపంచాయతీ నిధులు రాష్ట్రఖజానకు మళ్లించారని ఆరోపించారు. సర్పంచ్‌లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్ నుంచి కెసిఆర్ తీసుకున్నారని విమర్శించారు. గ్రామవ్యవస్థ బాగుపడాలంటే పార్లమెంట్ బాగుపడాలి అంటే కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆయన అన్నారు. పంచాయతీరాజ్ అభియాన్ పోచంపల్లిలో యాత్ర చేసినప్పుడు అనేక సమస్యలు మా దృష్టికి వచ్చాయని రేపు లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 ఎంపిసీట్లుగెలిచి కేంద్రంలోకి అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

# ఆరునూరైనా ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం

### కాళేశ్వరం ప్రాజెక్టు పెద్ద అవినీతిమయం

### 2 కిలోమీటర్లున్న అసెంబ్లీకి రాలేని కెసిఆర్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**ఇల్లెందు, ప్రభాతవార్త:** కాళేశ్వరంతో ఖజానా ఖాళీ చేశారు. ధరణితో భూములన్నీ దోచుకున్నారు. అనేక పథకాల్లో దోపిడి. చివరకు గొర్రెల పంపిణీలోనూ అవినీతే. సోనియాగాంధీ తెలంగాణ అమర వీరుల త్యాగాలను గుర్తించి రాష్ట్రాన్ని ఇచ్చారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రశేఖర్‌రావు చేసిందేమీ లేదు. కేవలం కుటుంబ సభ్యులకు పదవులు, ఆస్తులు దోచుకోవడమే తప్ప ఆయన చేసిందేమీ లేదంటూ ధ్వజమెత్తారు. గురువారం ఇల్లెందు సింగరేణి గ్రౌండ్‌లో మహబూబాబాద్ పార్లమెంటరీ స్థాయి సన్నాహక సమాశం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తనదైన శైలిలో కేసీఆర్ కుటుంబంపై విరుడుకుపడ్డారు. రాష్ట్రానికి కేసీఆర్ చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. రూ.7లక్షల కోట్లు అప్పుతీసుకొచ్చి రాష్ట్రాని అప్పులపాలు చేసిందని పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే కేసీఆర్ పాలనలో కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతిని ఎండగడతామన్నారు. మేడిగడ్డ కుంగిందని ప్రజాప్రతినిధులు మంత్రులు వెళ్లి చూస్తే అది సహజమేగా అని కేటీఆర్ అంటున్నాడు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఎట్లా కుంగుతుందో చెప్పాలన్నారు. ఏమైంది మేడిగడ్డకు రూ.2వేల కోట్లు పెడితే పునరుద్దరణ చేయొచ్చని కేటీఆర్ అంటున్నాడు. ఇంత దరిద్రంగా హాస్యాస్పదంగా మాట్లాడటం దౌర్భాగ్యమన్నారు. అదే విధంగా 80వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ ఇంజినీర్ కంటే తానే ఎక్కువని కాళేశ్వరాన్ని నిర్మించారు. కానీ ఒక్క ఎకరానికి నీరుపారడం లేదని తెలిపారు. కేసీఆర్ చిట్టా చెప్పాలంటే మొదట ధరణి గురించి మాట్లాడాలి. ధరణితో కేసీఆర్, కేసీఆర్ కుటుంబ సభ్యులు వేల ఎకరాలు సొంతం చేసుకున్నారని ఆరోపించారు. పది సంవత్సరాలపాటు అవినీతిలో కూడుకు పోయిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు పార్లమెంట్‌లో పోటీ పడుతామని శపథం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏది ఏమైనప్పటికీ 17కు 16సీట్లు కాంగ్రెస్ గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. ఇల్లెందంటే నాకు చాలాఇష్టమని కనకయ్య మనస్తత్వం చాలా బాగుంటుందని కొనియాడారు. ఇల్లెందు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామంటూ స్పష్టం చేశారు. నాతోపాటు ఉన్న జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పూర్తిగా సహకరిస్తామన్నారు.

# బలహీన వర్గాల అభివృద్దే కాంగ్రెస్ లక్ష్యం

### ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఆధిక్యత ఉండి కూడా, మీ పొగడ నియంతృత్వ వైఖరితో, మీ పార్టీ సభ్యులను సమన్వయ పరచలేక ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ వైఫల్యం చెంది, వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్‌పై విరుచుకుపడడాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ విప్ ఎందుకు జారీ చేయలేదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అనడాన్ని తప్పుపట్టారు. సమయానుకూలంగా వ్యవహరించాలని, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌కు సూచించామన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎం కోరుకుంటున్నారని, టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని సపోర్ట్ చేయాలని కోరుకున్నారా అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ దూరం ఉండి ఉంటే కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒకటే అని ప్రచారం చేస్తారా చేయరా మీరు ప్రజలకు ఎం సందేశాన్ని ఇవ్వాలని అనుకుంటున్నారని నిలదీశారు.

జగిత్యాల రూరల్ మండలం ఎంపిపి మూడేళ్ల క్రితం ఖాళీ అయ్యిందని జగిత్యాల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవి ఖాళీ అయి ఏడాదిన్నర గడిచిందన్నారు.

# రాష్ట్రంలో మెట్రో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెట్టండి

### అవసరమైన సహకార అందిస్తాం

### భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌ను కోరిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 29:** తెలంగాణ రాష్ట్రంలో మెట్రో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెట్టండి. అవసరమైన భూమి, ఇతర వనరులు, సహకారం ప్రభుత్వ పక్షాన అందిస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సచివాలయంలో భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ కంపెనీ సిఎండి శంతను రాయ్ బృందంతో డిప్యూటీ సిఎం సమావేశం అయ్యారు. బిఇఎంఎల్ కంపెనీ బేస్ ఎక్కడ, ఏఏ రంగాల్లో పెట్టుబడులు, ఉత్పత్తులు సృష్టిస్తుందో అడిగి తెలుసుకున్నారు. మెట్రో రైల్ కోచ్‌లు, రక్షణ, మైన్స్ వంటి రంగాల్లో తమ కంపెనీ పని చేస్తుందని సిఎండి శంతను రాయ్ డిప్యూటీ సిఎం వివరించారు. బెంగుళూరు కేంద్రంగా తమ కంపెనీ పని చేస్తుందని, రక్షణ రంగానికి సంబంధించి కేరళ రాష్ట్రంలోని పాలక్కడ్‌లో, సింగరేణిలో ఎర్త్ మూవర్స్ రంగాల్లో పనిచేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయం ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉన్నందున తాము రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు బిఇఎంఎల్ సిఎండి తెలిపారు. మెట్రో కోచ్ ఫ్యాక్టరీల తయారీలో ఇతర కంపెనీలకు బిఇఎంఎల్‌కు ఉన్న తేడా ఏంటీ? ధరలు, నాణ్యత వంటి అంశాల్లో మీకు ఉన్న ప్రత్యేకత ఏంటో కంపెనీ లెటర్‌పై వివరించాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఇఎంఎల్ కంపెనీ మెట్రో కోచ్ నమూనాను కంపెనీ సిఎండి శంతను రాయ్ బృందం డిప్యూటీ సిఎంకు అందజేసింది.

# పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలు, పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం

### సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్‌తో బృందంతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 29:** పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలు రాష్ట్రంలో సింగపూర్ నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన కౌన్సిల్ జనరల్ ఆఫ్ రిపబ్లిక్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ బృందంతో సచివాలయంలో చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రత్యేకంగా సహకారం తీసుకుంటామని పాంగ్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖతో రెడ్డి సంఘం ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** తెలంగాణలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించాలని రెడ్డి సంఘం ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సచివాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు మంత్రిని కలిశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ జారీకి నిర్దేశించిన ఆదాయ పరిమితిని రూ.8 లక్షల నుంచి 12 లక్షలకు పెంచేలా చర్యలు తీసుకునేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాగా, తమ విజ్ఞప్తికి మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించినట్లు రెడ్డి సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

### కృష్ణాజలాల వాటాలో కెసిఆర్ కారణంగా

# తెలంగాణకు శాశ్వత అన్యాయం

### కెసిఆర్.. మహబూబ్‌నగర్‌లో చేతనైతే పోటీచేయ్: వంశీచంద్‌రెడ్డి సవాల్

**హైదరాబాద్,ఫిబ్రవరి 29,ప్రభాతవార్త:** కృష్ణా జలాల వాటలో కెసిఆర్ తెలంగాణకు శాశ్వతంగా అన్యాయం చేసి చరిత్రలో నిలిచిపోతున్నారని సిడబ్లుసి సభ్యులు మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో ఎంఎల్‌ఏలు జి.మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లిశంకర్, పర్ణికారెడ్డిలతో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కెసిఆర్ చేతగాని తనం వల్ల కృష్ణాజాలలో 299 టిఎంసిల నీటిని వదులుకున్నారని ఆయన ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అనుమతులు లేని ప్రాజెక్టులకు 575 టిఎంసిలు తరలించుకుపోతూ వుంటే కేంద్రం వద్ద ఒప్పుకొన్నాడని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ వాటాను శాశ్వతంగా ఆంధ్రప్రదేశ్‌కు దఖలు చేస్తూ 2016 జూన్ 21న అపెక్స్ కౌన్సిల్‌లో సంతకాలు పెట్టి దక్షిణ తెలంగాణకు మరణశాసనం రాసినాడని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయబద్దమైన వాటాను వదులు కొని పెండింగ్ ప్రాజెక్టులు కట్టకుండా తెలంగాణను బీడుచేశాడని అన్నారు .ఎస్‌ఎల్‌బిసి ఆర్డీఎస్ విస్తరణ మహబూబ్‌నగర్‌కు 10 టిఎంసిల నీరు పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఎందుకు నిర్లక్ష్యం చేశారో తెలంగాణ ప్రజలకు కెసిఆర్ సమాధానం చెపానపలని ఆయన కోరారు. కెసిఆర్ ఎపి జలదోపడికి కాపాలకుక్కల మారాడని ఆయన ఎద్దేవా చేశారు. సంగం బండకు నిధులు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొద్దిరోజులలోనే కేటాయించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. పాలమూరు రంగారెడ్డి మూడు నెలలో చేస్తుందని ఇది పదేళ్ళు కెసిఆర్ నిర్లక్ష్యం చేశారు అని అన్నారు. కొండంగల్ నారాయణ పేట ఎత్తిపోత పథకం పాలమూరు రంగారెడ్డిపథకం త్వరలోనే పూర్తిచేస్తామని ఆయనభరోసా ఇచ్చారు. కెసిఆర్ జలదోపడికి కి ఏపికి కాపలా కుక్కలా ఉన్నాడని ఆయన చేసిన అన్యాయంపై బహిరంగచర్చకు వస్తాడాన అని సవాల్ విసిరారు. దమ్ము ధైర్యం ఉంటే మహబూబ్‌నగర్ నుంచిపోటీ చేసి గెలువాలని సవాల్ కూడా విసిరారు

# మార్చి 4,5 తేదీల్లో ప్రధాని మోడీ పర్యటన

### ఏర్పాట్లను సమీక్షించిన సిఎస్ శాంతికుమారి



**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడి మార్చి 4, 5 తేదీలలో తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రధానమంత్రి పర్యటనకు సంబందించిన జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను సిఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాటు చేయాలని అధికారులను సిఎస్ ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి 4వ తేదిన ఆదిలాబాద్, మార్చి 5వ తేదిన సంగారెడ్డిలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు రెండు చోట్ల బహిరంగ సభలలో కూడా ప్రసంగిస్తారన్నారు.

అందుకను గణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రత ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖకు సిఎస్ సూచించారు. విమానశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. ప్రధని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖను ఆదేశించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధానమంత్రి పర్యటనను విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డిజిపి రవిగుప్తా, హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, ఫైర్ సర్వీసెస్, డిజి నాగిరెడ్డి, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్‌రావు, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తు, గవర్నర్ సెక్రటరీ సురేంద్రమోహన్, సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్, టిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# రాహుల్ ఐతే ఒకే.. భారీ మెజారిటీతో గెలిపిస్తాం

### లేదంటే నేనే బరిలో ఉంటా .. నేనంటే నేనే..

### ఖమ్మం బరిలో నిలవడానికి పెరుగుతున్న ఆశావాహులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 29, ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ ఖమ్మంలో పోటీ చేస్తే ఓ కే భారీ మెజార్టీతో గెలిపిస్తాం. గాంధీ కుటుంబ సభ్యులు పోటీ చేయపోతే నాకంటే ఎక్కువ కష్టపడ్డవాళ్ళు ఎవరున్నారు నాకే టికెట్టు ఇవ్వాలనే గళం ఖమ్మం బరిలో నిలవాలనే ఔత్సాహికుల నుంచి బలంగా వినిపిస్తోంది. ఖమ్మంలో ఇప్పటికే ముగ్గురు మంత్రుల కుటుంబీకులు విశ్వప్రయత్నాలు చేస్తుండగా నేనేం తప్పు చేశాను కొత్తగా వచ్చినవాళ్ళు టికెట్లు అడిగితే నా లాంటి సీనియర్ల పరిస్థితి ఏంటని విహెచ్ హనుమంతరావు ఖమ్మం నుంచి పోటీ చేసి తీరుతా అని భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఖమ్మం సీటు గరంగరంగా మారింది. ఫైర్‌బ్రాండ్ రేణుకాచౌదరిని రాజ్యసభ సీటు ఇచ్చి పక్కకు తప్పించినా ముగ్గురుమంత్రులతో పాటు వివిసి ట్రస్ట్ అధినేత రాజేంద్రప్రసాద్ ఢిల్లీ స్థాయిలో తీవ్రప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులుచర్చించుకుంటున్నాయి. పార్టీ కోసం త్యాగాలు చేశామని పొట్లనాగేశ్వరావు, రాయల నాగేశ్వరావు, కొత్తగూడెం నేత నాగసీతా రాములు, జెట్టి కుమార్‌లు అవకాశం కల్పించాలని పట్టు బడుతున్నారు. ఖమ్మం నుంచి లోక్‌సభ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని 12 మంది దరఖాస్తుచేసుకొన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అలయన్స్ ఒక సీటు మినహా అంతా వూడ్చేసింది. ఖమ్మం సెగ్మంట్‌లో ఆరు కాంగ్రెస్ అసెంబ్లీసెగ్మంట్లు, ఒకటి మిత్రపక్షమైన సిపిఐ గెలిచింది. ఖమ్మంలో అదే జోష్ కొనసాగుతుండటంతో సోనియాగాంధీని బరిలో నిలుపాలని తొలుత చూశారు. ఆమె ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటానని రాజ్యసభకు పోటీ చేశారు. రాహుల్‌గాంధీ ఖమ్మం బరిలో దిగుతారని రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినాటి నుంచి ప్రచారం ఊపందుకొంది. ఖమ్మంలో ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులను బరిలో నిలిపేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తుండటంతో ఈ వివాదంకు శుభం కార్డు వేసేందుకు రాహుల్ పోటీ చేసే అవకాశం కూడా కొట్టిపారేయలేమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీనిని అనుగుణంగానే ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళ రాష్ట్రంలోని వాయనాడు నుంచి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సతీమణి అన్నిరాజా ను సిపిఐ అభ్యర్థిగా ప్రకటించడంతో ఇక రాహుల్‌గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తారనే వూహాగానాలకు బలం చేకూరింది. ఇండియా కూటమి లోని ఇతర పార్టీలతో కాంగ్రెస్ సీట్లసర్దుబాటుకు చర్చలు జరుపుతున్నది. ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న వాయనాడు నుంచి పోటీ చేయాలని ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ కూడా పట్టుపడుతోంది. మరోవైపు సిపిఐ తన అభ్యర్థిని వాయనాడు నుంచి ప్రకటించిన నేపథ్యంలో రాహుల్ అక్కడ నుంచి తప్పుకుంటారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోన్నది. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయాలని టిపిసిసి అధ్యక్షుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోనియాగాంధీని కలిసి గతంలో అనేకమార్లు విన్నవించారు. అనారోగ్య కారణాల వల్ల ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయదలుచుకోలేదని ఆమె తిరస్కరించారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యమం వహించాలని ఆమెను కోరినా ఆమె రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్ళారు. ఇండియా కూటమి నుంచి వాయినాడు స్థానం కోరే వారు అధికంగా ఉండటంతో ఇక అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ రాహుల్ తెలంగాణలో పోటీ చేయడానికి సురక్షిత స్థానం ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఖమ్మం లోక్‌సభ స్థానంను, భువనగిరి లోక్‌సభ స్థానంను ప్రాథమికంగా ఎంపిక చేశారు. రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి పోటీ చేయాలనే సంకల్పంతో ఉండటంతో ఆయన తెలంగాణలో పోటీచేయడానికి అంగీకరించారని తెలిసింది. రాహుల్‌గాంధీ ఉత్తరప్రదేశ్ లోని అమేథి నుంచి కూడా పోటీ చేసినా బిజెపి నుంచి బలమైన అభ్యర్థి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ బరిలో ఉండబోతుండటంతో కాంగ్రెస్‌కు అక్కడ పల్లేరుపై నడకలా వుంటుంది. సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలి నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉంది. బిజెపి ఉత్తరప్రదేశ్‌లో ఈ రెండు స్థానాలు తన ఖాతాలో వేసుకోవాలనే సంకల్పంతో ఉంది. మరోవైపు ఏఐసిసి నేతలు లోక్‌సభ అభ్యర్థుల ఎంపికను వేగిరతరం చేయాలని రాష్ట్రనాయకత్వంను ఆదేశించింది. మార్చి రెండోవారం మొదట్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో అభ్యర్థుల ఎంపిక జాప్యం కాకుండా చూడాలని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్ సలహా ఇచ్చారు. తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ ఎంపిక చేసిన జాబితాపై తర్వగా స్క్రీనింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని కేసి వేణుగోపాల్ ఇటీవల ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కుమారుడి వివాహారంకు హాజరై ముఖ్యమంత్రికి సూచించారు. తెలంగాణలో గెలుపు గుర్రాలకు లోక్‌సభ టికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. 14లోక్‌సభ స్థానాలు గెలుపొందాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకొంది. బిజెపి బిఆర్ఎస్ అభ్యర్థులను ఎదుర్కొనగలిగే నాయకులను లోక్‌సభ ఎన్నికల బరిలో దింపేందుకు ఖచ్చితమైన ప్రణాళికను రూపొందించారు. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు వుండగా వరంగల్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి నియోజకవర్గాలు ఎస్సీలకు మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎస్టీలకు రిజర్వు చేయబడినాయి. మిగిలిన 12 నియోజక వర్గాలలో 5 బిసిలకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యుడిగా సిఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన కోస్గిసభలో ప్రకటించారు. ఎంఐఎం సిట్టింగ్ స్థానమైన హైదరాబాద్‌తో కలిపి 12 లోక్‌సభ స్థానాలలో నల్లగొండ, భువనగిరి, చేవెళ్ళ, కరీంనగర్, నిజామాబాద్ లోక్‌సభ స్థానం రెడ్లను బరిలో నిలిపే అకాశం ఉంది. సికిందరాబాద్, జహిరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి బిసిలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ యోచిస్తున్నది. నిజామాబాద్ నుంచి టి.జీవన్‌రెడ్డిపోటీలో ఉంటారని ప్రచారం జరుగతోంది, మెదక్ నుంచి పిసిసి అధికార ప్రదినిధి భవానిరెడ్డి, బండారు శ్రీకాంతరావు ఉన్నప్పటికి ఇతర పార్టీల నుంచి వచ్చేవారి కోసం అధినాయకత్వం ఎదురుచూస్తున్నది. ఖమ్మంలో రాహుల్ పోటీ చేయకపోతే ఉపముఖ్యమంత్రి సతీమణి నందిని, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, తుమ్మల ఉపేదందర్‌రావు బరిలో నిలిచేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మరోవైపు హనుమంతరావు బిసికార్డుతో" మైహూనా! " అంటూ ముందుకు వస్తున్నారు.

నాగర్‌కర్నూల్ అభ్యర్థి దాదాపు ఖరారైనా అధికారికంగా వ్యక్తం కాలేదు. మల్లురవి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిగా రాజీనామా చేయడంతోనే అదిష్ఠానం నుంచి ఆయనకు అనుకూలంగా వాతావర్ణం ఉందని చెప్పకనే చెపుతున్నది. దీనికి తోడు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆది నుంచి తోడ్పడుతుండటంతో ఆయనకు దాదాపు సీటు ఖరారైందని నాగర్‌కర్నూల్‌లో ప్రచారం జరుగుతోంది. మొత్తానిక వచ్చేవారం రోజుల్లో కాంగ్రెస్ జాబితా కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# తనపై తానే హత్యయత్నం చేసుకున్న బిజెపి నేత అరెస్ట్

### గన్‌మెన్ కోసం నాటకం : ఆరుగురి రిమాండ్

**హైదరాబాద్ (ఉప్పల్), ఫిబ్రవరి 29, ప్రభాతవార్త :** పాత కేసుల నుంచి తప్పించుకునేందుకు ఒక బిజెపి సీనియర్ నేత తన మీద తాను హత్యయత్నం చేసుకుని చివరికి జైలు పాలైయ్యాడు. సినీ నిర్మాతగా, బిజెపి హిందూ ప్రచార కమిటి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఇతనిపై పాత కేసులతోపాటు, రౌడీషీటర్‌గా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం మల్కాజిగిరి డిసిపి పద్మజారెడ్డి, ఎసిపి పురుషోత్తమ్‌రెడ్డి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.



తప్పుడు హత్యయత్నం కేసు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి పద్మజారెడ్డి, ఎసిపి పురుషోత్తమ్‌రెడ్డి, సిఐ ఎలక్షన్‌రెడ్డి తదితరులు

బోడుప్పల్ ఆనందనగర్ కాలనీకి చెందిన ఎ.ఉదయ్‌భాస్కర్‌గౌడ్ 43, రాజలింగం కాలనీకి చెందిన తెలంగాణ జాగృతి అధ్యక్షునిగా పనిచేస్తున్న వి.శివ కిషోర్ 33, మన్సురాబాద్‌కు చెందిన బొల్లం యాదగిరి అలియాస్ గిరి, ఉట్లపల్లికి చెందిన బిఆర్ఎస్ యూత్ వింగ్ కార్యదర్శి కొండ అరుణ్ 35, హయత్‌నగర్‌కు చెందిన నందిపాటి సృజన్‌రెడ్డి 30, చింతలకుంటకు చెందిన అకుల ప్రశాంత్ 28, ఉప్పల్‌కు చెందిన ఎం.సంతోష్‌రెడ్డి, మహేష్‌లు స్నేహితులు. ఉదయ్ భాస్కర్‌పై గతంలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదు అయి ఉందని, పలు క్రిమినల్ కేసులలో ఇతని ప్రమేయం ఉన్నట్లు డిసిపి పద్మజారెడ్డి తెలిపారు. ఇతను సినీ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నాడని, మూడు చిత్రాలు నిర్మించినట్లు తెలిపారు. చలో, నర్తనశాల, హెచ్‌బిడి చిత్రాలు నిర్మించినట్లు తెలిపారు. నిర్మాతగా నష్టపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగినట్లు తెలిపారు. చెంగిచెర్లలోని బిఎంఆర్ స్కూల్ సమీపంలో రియల్ ఏస్టేట్ కార్యాలయాన్ని నడిపిస్తున్నాడని డిసిపి తెలిపారు. ఉదయ భాస్కర్ స్వచ్ఛ భారత్ కన్వీనర్ హిందీ విభాగం తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ హోం ఎఫైర్స్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఇతనిపై మేడిపల్లి పిఎస్‌లో హత్య కేసు విచారణలో ఉందని తెలిపారు. రాజకీయాల్లో ఎదిగేందుకు గన్‌మెన్‌లను ప్రభుత్వం నుంచి పొందేందుకు హత్యయత్నం సన్నివేశం రూపొందించారని తెలిపారు. అతను తన ప్లాన్‌ను తన స్నేహితులైన ఎం.సంతోష్‌రెడ్డికి చెప్పగా, అతను కొండా అరుణ గ్యాంగ్‌స్టర్‌తో ప్లాన్ గురించి చర్చించారని తెలిపారు. భాస్కర్, శివ కిషోర్, కొండ అరుణ్‌తో కలిసి నాగోల్ వద్ద ఉన్న అమరావతి బార్‌లో కలిసి ప్లాన్ అమలు చేయాలని. ఈనెల 24న నిర్ణయించారని తెలిపారు. భాస్కర్ చెప్పిన విధంగా నకిలీ సుఫారీ హత్యకు రూ.రెండున్నర లక్షలు చెల్లించేందుకు పధకం రూపొందించారని, రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారని తెలిపారు. పధకం ప్రకారం ఈనెల 24వ తేదిన భాస్కర్ తన డ్రైవర్ జహంగీర్‌గౌడ్‌తో కలిసి ఉప్పల్ భగాయత్‌లోని కాల బైరవ ఆలయాన్ని సందర్శించాడని తెలిపారు. రాత్రి 7 గంటల సమయంలో అతను తన డ్రైవర్‌తో కలిసి కారులో వెళ్లేందుకు ప్రయత్నించగా, నిందితులు తమ ప్లాన్ ప్రకారం కారును ఆపి డ్రైవర్ వైపు కారు అద్దాలు పగులగొట్టారని తెలిపారు. కర్రతో అద్దం పగులగొట్టారని, ముఖానికి కర్చీప్, మాస్క్ కట్టుకున్న వ్యక్తి భాస్కర్‌పై దాడి చేయడంతో పాటు అతని వెనుక వైపు ఎడమ వైపు భాగంలో కత్తితో గాయపరిచినట్లు తెలిపారు. భాస్కర్ ఉప్పల్‌లోని టిఎక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తనపై హత్యయత్నం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు.

